## క్లుప్తంగా

### ప్రత్యేక పూజలు

**టేకుమట్ల :** మండలంలోని వెలిశాల శ్రీ చెన్నకేశవ స్వామి శివాలయంలో తహసీల్దార్ విజయలక్ష్మి–శేఖర్ దంపతులు మంగళవారం ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకుడు బ్రహ్మచారి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### చికిత్స పొందుతున్న మహిళ మృతి


రేణుక (ఫైల్)

**రేగొండ :** మండలంలోని దుంపిల్లపల్లి గ్రామానికి చెందిన పోలుదాసరి రేణుక (49) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై సందీప్ కుమార్ తెలిపారు. రేణుక కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతుందని, గత నెల 24న నొప్పి ఎక్కువ కావడంతో తట్టుకోలేక ఎలుకల మందు తాగిందన్నారు. గమనించిన కుటుంబ సభ్యులు ఎంజీఎంకు తరలించి, మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించి చికిత్స అందించారు. కాగా చికిత్స పొందుతూ మంగళవారం మరణించింది. మృతురాలి కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### పరామర్శ

**ఏటూరునాగారం :** సాక్షి దినపత్రిక రిపోర్టర్ భూక్య సునీల్‌నాయక్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు, గోవింద్ నాయక్ మంగళవారం పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రదీప్‌రావు, రమేష్, సత్యనారాయణ, మోహన్, స్వామి, బాబు, ఆదిరెడ్డి, ఓదేలు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

### నివాళి

**వెంకటాపురం(కె) :** మండల కేంద్రానికి చెందిన దివంగత టీడీపీ నాయకుడు అత్మకూరి సూరిబాబు వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నిరుపేద విద్యార్థుల చదువుల నిమిత్తం రమేష్ సాయం అందజేశారు. గ్రామస్తులు లక్ష్మణరావు, పట్టాభి, సాంబశివరావు, రవి, లక్ష్మినారాయణ సత్తిబాబు ఉన్నారు.

### ‘అసెంబ్లీ నియోజక వర్గంగా ఏర్పాటు చేయాలి’

**వెంకటాపురం(కె) :** త్వరలో ఏర్పాటు చేయనున్న అసెంబ్లీ నియోజక వర్గాల ఏర్పాటులో వెంకటాపురం మండల కేంద్రంగా అసెంబ్లీ నియోజక వర్గాన్ని ఏర్పాటు చేయాలని తెలంగాణ నేతకాని సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాడీ ఈశ్వర్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. భద్రాచలం, ములుగు నియోజక వర్గాలకు మధ్యలో ఉండి అభివృద్ధికి దూరంగా ఉన్న వెంకటాపురం మండలం అభివృద్ధి చెందాలంటే నియోజక వర్గం మండల కేంద్రంగా చేయాలని అన్నారు.

### రాళ్లవాగు వంతెన పనులు త్వరగా పూర్తిచేయాలి

**వెంకటాపురం(కె) :** మండల పరిధిలోని ఎదిర గ్రామ సమీపంలో కుంగిపోయిన రాళ్లవాగు వంతెన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జునరావు మంగళవారం అన్నారు. రాళ్లవాగు వంతెన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు స్పందించి వంతెన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కోరారు.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

**మంగపేట :** మండలంలోని తిమ్మంపేట, బోరునర్సాపురం గ్రామాల మధ్య ఉప్పలనర్సయ్య చెరువు కట్టమైసమ్మ గుడి సమీపంలో మంగళవారం కారు, బైక్ ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. బోరునర్సాపురం గ్రామానికి చెందిన జాగటి చిన్న, ఎల్‌పీ రమేశ్‌తో కలిసి వారి స్నేహితుడిని బైక్‌పై మల్లూరుకు వెళ్లి అతడిని అక్కడ వదిలి తిరిగి వస్తున్నారు. మార్గమధ్యలో కట్టమైసమ్మ ఆలయానికి సమీపంలో మంగపేట నుంచి మణుగూరు వైపు వెళ్తున్న కారు, ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో బైక్‌పై ఉన్న చిన్న, రమేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు గాయపడిన ఇద్దరిని ఏటూరునాగారం ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాధితులను పరిశీలించి ఇద్దరి కాలు విరిగినట్లు ధ్రువీకరించారు. వైద్యం కోసం ఎంజీఎంకు రెఫర్ చేసినట్లు సమాచారం.

### నోట్‌బుక్స్ పంపిణీ

**గోవిందరావుపేట :** మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు వీరపనేని డాంగే మంగళవారం ఉచితంగా నోట్‌బుక్స్ అందజేశారు. వీరపనేని రామదాసు–వెంకటసుబ్బమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు డాంగే విద్యార్థులకు బుక్స్ పంపిణీ చేశారు. అధ్యాపకులు వెంకన్న, గణపతి, కార్తీక్ రెడ్డి, శోభారాణి, సతీష్, అనురాధ, రజియా, సుకన్య, నివ్యశ్రీ, తైసిన్ పాల్గొన్నారు.

# రైతు వేదికకు రక్షణ కరువు


తాడిచర్ల రైతువేదికలో ఏర్పాటు చేసిన దృశ్యమాధ్యమం (వీసీ)


పగిలిన కిటికీ అద్దాలు

- పగిలిన కిటికీ అద్దాలు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా తాడిచర్ల రైతువేదిక భవనం


తాడిచర్ల రైతు వేదిక

**మల్హర్ :** రైతు వేదిక భవనాలకు రక్షణ కరువై రాత్రిళ్లు మందుబాబులకు అడ్డాలుగా, ఆకతాయిల చేష్టలకు ధ్వంసం అవుతున్నాయి. మండలంలోని నాలుగు క్లస్టర్ పరిధిలోని తాడిచర్ల, పెద్దతూండ్ల, కొయ్యూరు, రుద్రారం గ్రామాల్లో గత ప్రభుత్వం ఒక్కో రైతు వేదిక నిర్మాణాలకు రూ.22లక్షల వ్యయంతో నిర్మించింది. ప్రస్తుతం తాడిచర్ల, కొయ్యూరు, రుద్రారం రైతు వేదికలు వినియోగంలో ఉన్నాయి. నిధుల లేమితో పెద్దతూండ్ల రైతువేదిక మధ్యలోనే నిలిచిపోయింది. ఇందులో భాగంగా తాడిచర్ల రైతు వేదికలో ఫర్నిచర్‌ను అధికారులు భద్రపరిచారు. అలాగే వివిధ పంటసాగులో ఆధునిక పద్ధతులపై అన్నదాతలకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రూ. 4లక్షల విలువ చేసే వీసీ (దృశ్య మాధ్యమాలు) సైతం ఏర్పాటు చేశారు. అయితే కొన్ని రోజుల క్రితం తాడిచర్ల రైతు వేదిక భవనంలో ఇరువైపులా కిటికీ అద్దాలను గుర్తు తెలియని వ్యకులు పగులగొట్టారు. సదరు కార్యాలయం ఊరికి దూరంగా ఉండడంలో వేదికల్లోని కిటికీ ఖాళీ ప్రదేశాల్లో దుండగులు చొరబడి విలువైన టీవీ, సామగ్రి దొంగలించే అవకాశాలు ఉన్నాయని పలువురు చెబుతున్నారు. వేసవిలో తాడిచర్ల ప్రభుత్వ పాఠశాలలోని టీవీ చోరీకి గురైన సందర్భాలు ఉన్నాయి. రైతుల సమావేశాలకు నిర్మించిన రైతు వేదికలు ఊరికి దూరంగా ఉండటంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్నాయని పలువురు వాపోతున్నారు. జిల్లా అధికారులు స్పందించి రైతు వేదికల భద్రతకు యంత్రాంగం సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. అలాగే తాడిచర్ల కార్యాలయంలో కిటికీ గ్లాసులు అమర్చాలని రైతులు కోరుతున్నారు.

# భూ సేకరణ గ్రామసభ


కాటారం: మాట్లాడుతున్న తహసీల్దార్ నాగరాజు

**కాటారం :** మండలంలోని గుమ్మాళ్లపల్లిలో మంగళవారం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో భూ సేకరణ గ్రామసభ నిర్వహించారు. చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా గుమ్మాళ్లపల్లి ఊర చెరువు విస్తీర్ణం పెంచడానికి భూమి అవసరం ఉంది. పలువురు రైతులకు సంబంధించి 6.3 ఎకరాల భూమి సేకరించేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. గ్రామసభ నిర్వహించి భూములు కోల్పోతున్న రైతులు, భూ విస్తీర్ణం వివరాలను అధికారులు వెల్లడించారు. అనంతరం రైతుల అభిప్రాయాలను కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, భూ సేకరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

**వర్షంతో నిలిచిన సర్వే**

**కాళేశ్వరం :** మహదేవపూర్ మండలం బొమ్మాపూర్‌లో చిన్న కాళేశ్వరం మెయిన్ కాల్వ పనుల భూసేకరణ కోసం చేపట్టిన సర్వే వర్షం కారణంగా మంగళవారం నిలిచింది. సుమారుగా 17ఎకరాల భూమిని రైతులు కోల్పోతుండగా వారితో తహసీల్దార్ రామారావు మాట్లాడారు. బుధవారం వర్షం కారణంగా నిలిచిన సర్వే జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. డీటీ కృష్ణ, ఏఈఈ భరత్ ఉన్నారు.


కాళేశ్వరం: సర్వేలో పాల్గొన్న అధికారులు

**కాల్వ నిర్మాణానికి..**

**కాటారం :** చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా గారెపల్లి రిజర్వాయర్ నుంచి బొప్పారం, ప్రతాపగిరి చెరువులకు నీటి సరఫరా కోసం నిర్మించనున్న కాల్వ కోసం రెవెన్యూ అధికారులు మంగళవారం భూ సేకరణ సర్వే నిర్వహించారు. భూ సేకరణ సర్వే సందర్భంగా ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్సై–2 శ్రీనివాస్ బందోబస్తు నిర్వహించారు. సర్వేయర్ సతీశ్, రెవెన్యూ సిబ్బంది శ్రీనివాస్, సతీశ్ పాల్గొన్నారు.

### జీపీ కార్యదర్శులకు శిక్షణ



**కాటారం :** గ్రామ పంచాయతీలను అన్ని రంగాల్లో తీర్చిదిద్ది ఆదర్శంగా నిలవడానికి అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని ఎంపీడీఓ అడ్డూరి బాబు, ఎంపీఓ వీరస్వామి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం గ్రామ పంచాయతీలను పలు అంశాల్లో తీర్చిదిద్దడంపై మండల స్థాయి అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీల్లో ప్రత్యేకంగా తొమ్మిది అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధి కారులు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు

### ఉచిత వైద్యశిబిరం


వైద్యశిబిరంలో పరీక్షలు చేస్తున్న నాగరాణి

**మొగుళ్లపల్లి :** మండల కేంద్రంలోని మహాత్మా గాంధీ జ్యోతిరావు పూలే పాఠశాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మండల వైద్యాధికారి నాగరాణి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 110 మంది విద్యార్థులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కాచి చల్లార్చిన నీరు తాగాలన్నారు. విద్యార్థులకు ఎవరికైనా జ్వరం, ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నట్లయితే వైద్య సిబ్బంది తెలియజేయాలని నాగరాణి తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సంధ్య, ప్రిన్సిపల్ శారద, సూపర్‌వైజర్ సునీత, ఏఎన్ఎం శ్రీలత, ఆశ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ‘పుట్ట మధు ఆరోపణలు అర్థరహితం’

**కాటారం :** మంత్రి శ్రీధర్‌బాబుపై మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు చేస్తున్న ఆరోపణలు, అనుచిత వ్యాఖ్యలు అర్థరహితమని మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చిటూరి మహేశ్ తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యూత్ కాంగ్రెస్ నాయకులతో కలిసి మహేశ్ మాట్లాడారు. పుట్ట మధు దళితుల పట్ల చేసిన తప్పిదాలను కప్పిపుచ్చుకోవడానికి వారిపై కపట ప్రేమ చూపిస్తున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలో ఉనికిని కోల్పోయి పుట్ట మధు హైదరాబాద్‌కు వెళ్లి ప్రెస్‌మీట్‌లు పెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొందని విమర్శించారు. మండల స్థాయి బీఆర్‌ఎస్ నాయకులు కనీస అవగాహన లేకుండా మాట్లాడటం విడ్డూరమన్నారు. యూత్ కాంగ్రెస్ నాయకులు కడారి విక్రమ్, పట్టణ అధ్యక్షుడు పసుల మొగిలి, కోడి రవికుమార్, బోడ నరేశ్, మేడిపల్లి కిరణ్, బీరెల్లి మహేశ్, గడవేణ దేవేందర్‌యాదవ్, బొడ్డు రాజశేఖర్, జాడి రాజేశ్, మంత్రి నరేశ్, గోనె మహేశ్, సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించాలని ఎస్పీకి వినతి


సమావేశంలో మాట్లాడుతున్న బాధిత రైతులు

**భూపాలపల్లి రూరల్ :** సమస్యలను పరిష్కరించాలని పోలీస్ స్టేషన్‌కు వెళ్తే చిట్యాల ఎస్సై తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపిస్తూ.. చిట్యాల మండలంలోని చింతకుంట రామయ్యపల్లికి చెందిన అబ్బెంగుల రాజయ్య, కైలాపూర్‌కు చెందిన బూదారపు మార్కండేయ, చల్లగరిగేకు చెందిన ఇంచర్ల లక్ష్మి అనే ముగ్గురు రైతులు మంగళవారం ఎస్పీ కిరణ్‌ఖరేకు వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. అనంతరం జిల్లాకేంద్రంలోని కాకతీయ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తమకు భూసమస్యలు ఉన్నాయంటూ చిట్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే ఒకరివైపే మాట్లాడుతూ.. పట్టించుకోకుండా ఎస్సై తమని నానా ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పట్టించుకొని తమ సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎస్పీని వేడుకున్నామని తెలిపారు. భూ సమస్యలపై ఫిర్యాదులు వస్తు ఉంటాయని, గ్రామాల్లో పెద్దమనుషులతో మాట్లాడుకొని సమస్యలు పరిష్కరించుకోవాలని సూచిస్తామని తెలిపారు. పరిష్కారం కాని వారు కోర్టులకు వెళ్లాలని సలహాలిస్తామని ఎస్సై వివరించారు.

# రేపటినుంచి వైద్యశిబిరాలు


సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న డాక్టర్ వినయ్

**మల్హర్ :** సీజనల్ వ్యాధుల నేపథ్యంలో ఈనెల 3వ తేదీ నుంచి (గురువారం) ఈనెల 29 వరకు మెడికల్ క్యాంపులు నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి వినయ్‌భాస్కర్ తెలిపారు. మండల కేంద్రం తాడిచర్ల ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో సూపర్‌వైజర్స్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలతో మంగళవారం మెడికల్ క్యాంపుల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వినయ్ మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ నెల 3న రుద్రారం, 4న తాడిచర్ల, 7న కొయ్యూరు, 8న అన్సాన్‌పల్లి, 10న పెద్దతూండ్ల, 11న మల్లారం, 14న వల్లెకుంట, 15న చిన్నతూండ్ల, 17న కొండంపేట, 18న నాచారం, 21న దుబ్బపేట, 22న అడ్వాలపల్లి, 24న మల్లెంపల్లి, 25న ఎడ్లపల్లి, 28న తాడిచర్ల–2, 29న పాత రుద్రారంలో వైద్ శిబిరాలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

### విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ


ట్రంక్ పెట్టె, దుస్తులు అందజేస్తున్న ఎంపీడీఓ

**మల్హర్ :** మండల కేంద్రం తాడిచర్ల ఎస్టీ హాస్టల్ విద్యార్థులకు వార్డెన్ కిరణ్‌కుమార్‌తో కలిసి ఎంపీడీఓ నల్లగొండ శ్రీనివాస్ దుప్పట్లు, ట్రంక్ పెట్టెలను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 30 మంది విద్యార్థులకు దుప్పట్లు, దుస్తులు అందించారు. గిరిజన ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

### ఎంపికపై హర్షం

**కాటారం :** బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్సీ రాంచంద్రరావు ఎంపిక కావడంతో జిల్లా కౌన్సిలర్ బొమ్మన భాస్కర్‌రెడ్డి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు.

# విద్యుదాఘాతంతో ఎద్దు మృతి


మృతిచెందిన ఎద్దు వద్ద బాధితులు

**భూపాలపల్లి రూరల్ :** విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి చెందిన సంఘటన భూపాలపల్లి మండలంలోని గొల్లబుద్దారం గ్రామంలో మంగళవారం జరిగింది. రత్నం సుధాకర్‌కు చెందిన దుక్కిటెద్దు మేతకు వెళ్లగా గ్రామ శివారులోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ తీగలు వేలాడి ఉండడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ సుమారు రూ.90వేల వరకు ఉంటుందని బాధితుడు తెలిపారు.

# ప్రభుత్వ భూములను కాపాడాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

**చిట్యాల :** మండలంలోని చల్లగరిగ గ్రామంలో గల ప్రభుత్వ భూములను కాపాడాలని విముక్త చిరుతల పార్టీ (వీసీకే) రాష్ట్ర యూత్ అధ్యక్షుడు అంబాల అనిల్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు సిరిపెల్లి రమేశ్‌లు కోరారు. ఈ సందర్భంగా మంగళవారం వారు మాట్లాడుతూ చల్లగరిగ గ్రామానికి చెందిన కొంత మంది ప్రభుత్వ భూములపై హక్కు లేకున్నా వారు ఇష్టానుసారంగా సాగు చేసుకుంటున్నారని తెలిపారు. అనంతరం తహసీల్దార్ షేక్ ఇమామ్ బాబాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులు కోల్లూరి అశోక్, నోముల శివశంకర్, సిరిపల్లి తిరుపతి, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# లేబర్ కోడ్‌లను రద్దుచేసే వరకు పోరాటాలు


విలేకరుల సమావేశంలో పాల్గొన్న సింగరేణి జేఏసీ నాయకులు

**భూపాలపల్లి అర్బన్:** కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేసి ఏర్పాటు చేసిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేసే వరకు పోరాటాలు నిర్వహిస్తామని సింగరేణి కార్మిక సంఘాల జేఏసీ నాయకులు తెలిపారు. ఈ నెల 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ.. ఏరియాలోని ఏఐటీయూసీ కార్యాలయంలో మంగళవారం ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, టీజీజీకేఎస్, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ జేఏసీ సంఘాల రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు, కేంద్రం కమిటీ నాయకులు కొరిమి రాజ్‌కుమార్, మిర్యాల రాజిరెడ్డి, తుమ్మల రాజిరెడ్డి, చక్రపాణి, విశ్వనాథం మాట్లాడారు. పోరాటాలు, ఉద్యమాలు, ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న కార్మిక హక్కుల కోసం కార్మికులందరూ ముందుకు వచ్చి ఉద్యమించాలని కోరారు. కేంద్రం ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టకపోతే కార్మికులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రతీ ఒక్కరు సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల నాయకులు బడితెల సమ్మయ్య, కంపేటి రాజయ్య, సదానందం, రాంచందర్, చంద్రమౌళి, కుమారస్వామిలు పాల్గొన్నారు.

# వ్యసనాలకు దూరంగా ఉండాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రవి పటేల్

**మల్హర్ :** యువత, విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని తీన్మార్ మల్లన్న టీం జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ పేర్కొన్నారు. మండలంలోని తాడిచర్ల జిల్లా పరిషత్ పాఠశాలను మంగళవారం రవి పటేల్ సందర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెల్‌ఫోన్, గంజాయి, మద్యపానం తదితర వ్యసనాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో తాడిచర్ల గ్రామ కమిటీ అధ్యక్షుడు మేనం సంతోష్, అనంతుల సంపత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఎన్నిక


రవికి నియామక పత్రం అందజేస్తున్న కుమార్


కాళేశ్వరం: నియామక పత్రం ఇస్తున్న నాయకులు

**చిట్యాల :** తెలంగాణ బ్యాండ్ వాయిద్యా కళాకారుల సంఘం కమిటీని మండల కేంద్రంలో మంగళవారం ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు ఓనపాక కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల అధ్యక్షుడిగా పర్లపల్లి రవి, ప్రధాన కార్యదర్శిగా ఎండీ రఫీ, ఉపాధ్యక్షుడిగా ఏకు సమ్మయ్య, కార్యదర్శిగా లద్దునూరి ప్రభు, కోశాధికారిగా మిన్నపురం భద్రయ్య, కమిటీ సభ్యులుగా రేణుకుంట్ల మల్లేష్, ఎండీ జిలానీ, ఎండీ లాల్‌ను ఎన్నుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లా నాయకులు మొగిలి, రజాక్, పాణి, మొగిలి, తదితరులు పాల్గొన్నారు.

**కాళేశ్వరం ఎమ్మార్పీఎస్..**

**కాళేశ్వరం :** కాళేశ్వరంలో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. గ్రామశాఖ గౌరవ అధ్యక్షుడిగా బెల్లంపల్లి రాజయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడిగా అవినాష్, ఉపాధ్యక్షుడిగా చకినారపు రాజు, కార్యదర్శిగా రాకేష్, ప్రధాన కార్యదర్శిగా లేతకరి మహేందర్, కోశాధికారిగా లేతకరి సారయ్య, ప్రచార కార్యదర్శిగా మహేశ్‌లను ఏకగ్రీవంగా ఎన్నికున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ రుద్రారపు రామచంద్రం, మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్ తెలిపారు. ఈనెల 7న మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు గ్రామాల్లో జెండా ఆవిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు లేతకారి రాజయ్య, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి


మాట్లాడుతున్న తిరుపతి

**కాటారం :** ప్రజలు ప్రభుత్వాలు అందజేస్తున్న ఆర్థిక, సామాజిక భద్రతా పథకాలను వినియోగించుకోవాలని ఎల్‌డీఎం తిరుపతి అన్నారు. మండలంలోని అంకుషాపూర్‌లో మంగళవారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కాటారం శాఖ ఆధ్వర్యంలో జన సురక్షా ప్రచార కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రభుత్వం బ్యాంక్ ద్వారా అమలు చేస్తున్న ఆర్థిక, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ప్రధానమంత్రి జనధన్ యోజన, ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన, ప్రధాన మంత్రి జీవన్‌జ్యోతి యోజన, అటల్ పెన్షన్ యోజన తదితర పథకాలను ప్రజలకు వివరించారు. ఖాతాదారుల కేవైసీ పునరుద్ధరణ, నూతన నమోదు చేపట్టారు. ప్రతి లబ్ధిదారుడికి భద్రతా పథకాల పరిధిని చేరవేయడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నట్లు ఎల్‌డీఎం తెలిపారు. కాటారం ఎస్‌బీఐ మేనేజర్, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆవిర్భావాన్ని ఘనంగా జరుపుకోవాలి


మండల కేంద్రంలో నినాదాలు చేస్తున్న నాయకులు

**చిట్యాల :** ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను ఈనెల 7వ తేదీన ఘనంగా జరుపుకోవాలని జిల్లా ఇన్‌చార్జ్ కోలికపోగు వెంకటేశ్వర్‌రావు కార్యకర్తలను కోరారు. ఈ సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వెంకటేశ్వర్‌రావు హాజరై మాట్లాడుతూ పద్మశ్రీ గ్రహీత మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాల్లో జెండా గద్దెలను నిర్మించుకొని వేడుకలు నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ బొల్లి బాబు, మండల అధ్యక్షుడు దొడ్డె శంకర్, నాయకులు నేరేళ్ళ ఓదేలు, ప్రధాన కార్యదర్శి కట్కూరి మొగిలి, నాయకులు నరేష్, వినోద, రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.